క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచించారు. అధికారులతో కలసి సోమవారం 52వ వార్డులోని పలు కాలనీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. వుడాలే అవుట్ ప్రాంతంలో ఆర్అండ్‌బీ దరి లలితా డిలైట్ గ్రీన్ బెల్ట్, వనితా వాకింగ్ ట్రాక్, పాస్‌పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్‌లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్, వాటర్ సప్లై మొదలైన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు.అనంతరం వుడాలేఅవుట్ లో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం దగ్గర పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్అనూప్, ఏఈ అర్చన, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాహం తీర్చుతున్న చలివేంద్రాలు



మద్రిపాలెం వుడాలే అవుట్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

విశాఖ విద్య: ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేలా జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే ఎన్ఏడీ సెంటర్‌కు ప్రాధాన్యం ఇచ్చిన అధికారులు మద్రిపాలెం వుడా లే అవుట్‌కు వెళ్లే దారిలో, అదే విధంగా ఎన్ఏడీ సెంటర్ బస్టాప్, మద్రిపాలెం బీఆర్‌టీఎస్ రోడ్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. తాగునీటిని అందించేలా ఒకరిని నియమించారు.

ఏయూను సందర్శించిన సమాచార హక్కు కమిషనర్



రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుస్తకాన్ని బహూకరిస్తున్న కమిషనర్ శామ్యూల్

విశాఖ విద్య: రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ శామ్యూల్ జోనాథన్ సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌కు 'గుంటూరు–త్రూ ద ఏజెస్' అనే ప్రత్యేక పుస్తకాన్ని కమిషనర్ బహూకరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల జరుగుతున్న సందర్భంగా ఇదే తరహా పుస్తకాన్ని తయారు చేయడానికి ఆయన ఆసక్తి వ్యక్తం చేశారు. ఏయూ వీసీ రాజశేఖర్ దృష్టికి దీన్ని తీసుకెళ్లి అనుమతి తెలియజేస్తామని రిజిస్ట్రార్ అన్నారు. అనంతరం పలు అంశాలపై వీరు చర్చించారు.

హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని ధర్నా

సీతంపేట: చిల్లర వర్తకులకు హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లా ఫుట్‌పాత్ అండ్ తోపుడుబళ్ల కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద చిల్లర వర్తకులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లర వర్తకులకు సామాజిక భద్రత కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించినప్పటికీ ప్రభుత్వాలు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఏళ్ల తరబడి రోడ్డు పక్కన, కూడళ్లలో నిలువ నీడలేక చిల్లర వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిల్లర వర్తకులకు గుర్తింపు కార్డులు ఇచ్చి జీవీఎంసీ చేతులు దులుపేసుకుందన్నారు. చిల్లర వర్తకుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న ఆశీలు రద్దు చేయాలని, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు రుణాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలన్నారు. చిల్లర వర్తకుల సమస్యలపై ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేలం శివ, సంఘం నాయకులు కె.శ్రీనివాసు, పి.సూర్యారావు, పి.సాయికుమార్, కె.గణేష్, పి.అనిల్, యు.పుష్ప పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాయిని

గోపాలపట్నం సీహెచ్‌సీకి పెరుగుతున్న రోగుల తాకిడి

- గత ప్రభుత్వంలో మారిన ఆస్పత్రి రూపురేఖలు
- పెరిగిన సౌకర్యాలు, వైద్యుల సంఖ్య
- సీఎస్సార్ నిధులతో ఆపరేషన్ థియేటర్

డబ్బులేని కారణంగా పేద వాడు వైద్యానికి దూరం కాకుడదన్న లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైద్య రంగానికి పెద్దపీట వేశారు. చేరువలో ఆస్పత్రులు కట్టించారు. నాడు– నేడు కింద ఉన్న ఆస్పత్రుల రూపురేఖలు మార్చారు. వైద్య సిబ్బందితో పాటు అవసరమైన వసతులు కల్పించారు. అలా గోపాలపట్నం సీహెచ్‌సీ రూపురేఖలు మార్చారు. నేడు అది రోగుల పాలిట వరప్రదాయినిగా సేవలందిస్తోంది.



సాధారణ ఓపీ విభాగం వద్ద రోగులు

గోపాలపట్నం: గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పేదలకు వైద్య భరోసా కల్పిస్తోంది. వైద్యుల సంఖ్యతో పాటు నూతన భవనాలు అందుబాటులోకి రావడంతో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది.

అందుబాటులోకి నూతన ఆపరేషన్ థియేటర్



ఆపరేషన్ థియేటర్

కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంస్థ తమ సీఎస్సార్ నిధులు రూ.11లక్షలు వెచ్చించి అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసింది. దాని సేవలు కూడా ఇటీవల అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఒకే ఆపరేషన్ థియేటర్ ఉండేది. కొత్త భవనంలో మరో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి రావడంతో శస్త్రచికిత్సలకు కేజీహెకు రిఫర్ చేయడం తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.



ప్రసూతి ఓపీవద్ద గర్భిణులు

రోగుల తాకిడి

గత ప్రభుత్వం ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతో రోగుల తాకిడి పెరిగింది. రోజూ 250 నుంచి 300 మంది వ్యాధి గ్రస్తులు వస్తున్నారు. రెగ్యులర్ వైద్యులతో పాటు పీజీ విద్యార్థులు ఎంబీబీఎస్ హౌస్ సర్జన్లు సేవలు అందిస్తుండడంతో వ్యాధిగ్రస్తులకు సమయం కేటాయించి నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు.

మరిన్ని వసతుల కల్పనకు సన్నాహాలు

ఆస్పత్రి ఆవరణను సుందరంగా తీర్చిదిద్దేందుకు సన్నహాలు చేస్తున్నామని వైద్యులు చెబుతున్నారు. చెత్త తొలగించి పచ్చదనం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే గణబాబును కోరినట్టు తెలిపారు. ఫిజియో థెరఫీకి ఉపయోగపడే విధంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వైద్య సేవలు బాగున్నాయి



ఆస్పత్రిలో వైద్య సేవలు బాగున్నాయి. నాలుగేళ్ల నుంచి ఎక్కవ మంది డాక్టర్లు వచ్చారు. మంచి వైద్యం అందిస్తున్నారు. సౌకర్యాలు చాలా బాగున్నాయి. సమస్య విని తగిన వైద్యం సూచిస్తున్నారు.

–ఇమంది ఆదిలక్ష్మి, గోపాలపట్నం

ప్రసూతి విభాగంలో మెరుగైన సేవలు

ప్రసూతి విభాగంలో సేవలు మెరుగుపడుతున్నాయి. నెలకు గర్భిణులు సుమారు 400 మంది వస్తుంటారు. వారికి తనిఖీలు చేసి తగిన సూచనలు ఇస్తూ వైద్యం అందిదిస్తున్నారు. నెలలో 30 ప్రసవాలు సాధారణమైనవి కాగా తప్పని పరిస్థితిల్లో 6 నుంచి7 ప్రసవాలు సిజేరియన్ చేస్తున్నామని వైద్యులు చెబుతున్నారు. పిల్ల వైద్యులు ఉండడంతో అత్యవసర సేవలతో పాటు ప్రతిరోజు ఓపీ ద్వారా సేవలు అందిస్తున్నారు. పిల్లలను ఆకట్టుకునేదుకు టీవీలు, పలు రకాల బొమ్మలు ఆస్పత్రి ఆవరణలో వేయించారు. ఇవి చూడ ముచ్చటగా ఉన్నాయి. వీటిని చూస్తుంటే ఆస్పత్రికి వచ్చామన్న భావన కలగడం లేదని రోగులు మెచ్చుకుంటున్నారు.



గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్

సౌకర్యాలు సమకూరుతున్నాయి



ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు సమూరుతున్నాయి. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా తమ సహకారం అందిస్తున్నాయి. ఇటీవల రూ.11లక్షలతో ఆపరేషన్ థియేటర్ సామగ్రి ఇచ్చారు. నూతన భవనంలో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశాం. సర్జన్‌తో జనరల్ ఫిజీషియన్, ఎనస్థీషియా, గైనకాలజిస్ట్ వంటి 6 మంది వైద్యులు అందుబాటులో ఉంటున్నాం. సర్జరీలు కూడా చేస్తున్నాం.

–డాక్టర్ సుజాత, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

సీజ్ చేసిన బోరు పరిశీలన



ముత్యమాంబకాలనీలో సీజ్ చేసి బోరును పరిశీలిస్తున్న ఏఈ సుమన్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి ముత్యమాంబకాలనీలో అధికారులు సీజ్ చేసిన బోరును సోమవారం ఏఈ సుమన్ పరిశీలించారు. జీవీఎంసీ మంచినీటి బోరు నుంచి నీటిని వార్డు కూటమి నాయకులు చోరీ చేస్తూ నీటిని వ్యాపారం చేస్తుండడంతో 'సాక్షి'లో కథనాలు వెలువడ్డాయి. దీంతో జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశాల మేరకు కబ్జా చేసిన మంచినీటి బోరును గత వారంలో సీజ్ చేశారు. తాజా పరిస్థితిని తెలుసుకునేందుకు ఏఈ సుమన్ సోమవారం సిబ్బందితో ముత్యమాంబ కాలనీకి వెళ్లి సీజ్ చేసిన బోరును పరిశీలించారు. బోరు ఓపెన్ చేస్తే సమస్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యోగాసన పోటీల్లో పుష్పలత ప్రతిభ



అవార్డు అందుకుంటున్న పుష్పలత

విశాఖ విద్య: రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో నగరంలోని ఎన్ఏడీ ఏరియాకు చెందిన నీలాపు పుష్పలత ప్రతిభ చాటింది.ఆంధ్ర ప్రదేశ్ యోగ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 4న రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. 30–40 మహిళల విభాగంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది పోటీపడగా పుష్పలత వేసిన యోగాసనాలకు రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం దక్కింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెకు వెండిపతకంతో పాటు సర్టిఫికెట్ అందజేశారు. పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరగబోయే జాతీయస్థాయి యోగా పోటీలకు పుష్పలతను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు యోగా సాధకులు అభినందనలు తెలిపారు.

త్వరితగతిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న జోన్–5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆరు అర్జీలు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 03, పబ్లిక్ హెల్త్‌కు 02, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి గైర్హాజరు, సమయపాలన పాటించని అధికారులపై ఆయన మండిపడ్డారు. రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఏఈ ఉషారాణి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ సర్వేయర్ లీలావతి, మంచినీటి విభాగం ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా!

ఫోకస్

- రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి
- ప్రమాదాల బారిన వాహనదారులు



గోకుల్‌నగర్‌లో రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి

కంచరపాలెం: జీవీఎంసీ 56 వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారికి అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి వేస్తుండడంతో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంచరపాలెం పరిధి దుర్గానగర్, గొల్లకంచరపాలెం, తోటవీధి, గౌరీనగర్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. జోన్–5 టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ లోపంతో బిల్డర్లు నిర్లక్ష్యంగా పనులు చేస్తున్నారు. ఇసుక, పిక్క, ఇటుకులు వంటి సామగ్రిని రోడ్ల మీద ఇష్టానుసారంగా వేస్తున్నారు. ఇరుకు రహదారుల్లో సామగ్రి వేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, ఘర్షణకు దిగుతున్నారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుకున్నామని దురుసుగా సమాధానాలు ఇస్తున్నారని చెబుతున్నారు.

పెంచిన పార్కింగ్ ఫీజు రద్దు చేయాలి



స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ విభాగాధిపతికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: ఉద్యోగుల సౌకర్యార్థం కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో పెంచిన ఫీజు రద్దు చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు కోరారు. టౌన్ అడ్మిన్ విభాగాధిపతి చంద్రశేఖర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు 12 గంటలకు రూ. 1, 24 గంటలకు రూ. 2 ద్విచక్ర వాహన ఫీజు కాగా దాన్ని ఒకే సారి రూ. 10, రూ. 20లకు పెంచడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆ ఫీజులు రద్దు చేసి పాత పద్ధతి కొనసాగించాలన్నారు.

డైరెక్టర్ (పర్సనల్)కు సీఐటీయూ వినతి

పెంచిన పార్కింగ్ ఫీజు రద్దు చేయానలి స్టీల్ సీఐటీయూ నాయకులు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్)కు వినతిపత్రం అందజేశారు. నగరం, పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులు, ఉక్కునగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యార్థం పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేసి నామమాత్రం ఛార్జీలు (రూ.1, రూ.2)లు వసూలు చేసేవారన్నారు. వెంటనే కొత్త ఫీజులను రద్దు చేయాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు. రామస్వామి కోరారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ నూతన విభాగాధిపతిని సత్కరిస్తున్న పీఎఫ్, ఎస్ఏబీఎఫ్ ట్రస్ట్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ (ఎస్ఏబీఎఫ్) పెండింగ్ బకాయిలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ పీఎఫ్, ఎస్ఏబీఎఫ్ ట్రస్ట్‌ల ప్రతినిధులు ఫైనాన్స్ విభాగాధిపతి హేమంత్ కుమార్ ఝాను కోరారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం ఉక్కు గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కె.ఎస్.ఎన్. రావు నేతృత్వంలో కలిసి ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను ఆయనకు వివరించారు. స్టీల్‌ప్లాంట్‌లో ఎస్‌పీఎస్ అమలు చేయాలన్నారు. పెండింగ్ జీతాలను తొందరలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, కాటం చంద్రరావు, రామచంద్రరాజు, సైనుబాబు, దేముడు, సత్యనారాయణమూర్తి, తిరుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్ అధ్యాపకులకు అభినందన

మల్కాపురం: పరిశోధన పద్ధతులపై గత నెల 16 నుంచి 30వ తేదీ వరకు అంతర్జాతీయ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో(ఆన్‌లైన్ ద్వారా)మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో అధ్యాపకులుగా పని చేస్తున్న ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి పాల్గొన్నారు. వీరు ప్రతిభ చూపడంతో సోమవారం సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి సర్టిఫికెట్‌లు ఇచ్చి సత్కరించారు. తమ కళాశాల కీర్తిని ఇనుమడింపజేశారని అభినందించారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె నోటీసు



డాక్టర్ కిరణ్ కుమార్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న యూనియన్ నాయకులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నట్టు జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు గాజువాక సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, భద్రతా పరికరాలు, పనిముట్లు సరఫరా చేయాలని, రిటైర్మెంట్, డెత్ కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని, ఆప్కాస్ వర్కర్ల మిస్సింగ్ జీతాలు, డైలీవేజ్ కార్మికులకు వేతన బకాయిలను చెల్లించాలన్న డిమాండ్లతో ఈ సమ్మెలో పాల్గొంటున్నట్టు నాయకులు పేర్కొన్నారు. సమ్మె నోటీసును అందజేసినవారిలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, నక్క నాగరాజు, సోమాదుల గణేష్, పద్మ, లక్ష్మణరావు తదితరులు తెలిపారు.

ఘనంగా పైడిమాంబ తొలేళ్లు



అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు ,చిత్రంలో ఎమ్మెల్యే గణబాబు

గోపాపట్నం: ప్రశాంతినగర్ వాసుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్లను ఘనంగా నిర్వహించారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలోని నూకాలమ్మ ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని అమ్మవారి ప్రతిమలను భక్తి శ్రద్ధలతో మోసుకుని ఊరేగించారు. ఊరేగింపులో విభిన్న వేషధారణలు, కేరళ డప్పు కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతిమలను పైడితల్లి అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించారు.

నేడు ప్రధాన పండగ

మంగళవారం పైడితల్లి అమ్మవారి ప్రధాన పండగ నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా క్యూ లైన్లు.. ప్రసాదాల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నారు.

ఘనంగా దాసరి జయంతి

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హెల్ప్ టు హెల్ప్ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు సినీ దిగ్గజ దర్శకుడు, నటుడు దాసరి నారాయణరావు 78వ జయంతి వేడుకలు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు, కార్యదర్శి నరవ ప్రకాశరావు, దర్శకుడు మీగడ శివశ్రీ, డాక్టర్ మీగడ రామలింగస్వామి, డాక్టర్ బి.ఎం.నాయుడు, నిర్మాత రఘురామారావు తదితరులు దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ దాసరి ఒక ఫిల్మ్ యూనివర్సిటీ అని, ఆయన జయంతిని తెలుగు సినిమా డైరెక్టర్ల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. సినీరంగంలో ఎంతో మంది నటులను ఆయన వెలుగులోకి తెచ్చారని కొనియాడారు. అనంతరం ఇటీవల అవార్డులు పొందిన సెకెండ్ ఇన్నింగ్స్, ప్రావీణామృతం లఘు చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, బాబ్జి, చాట్ల బాబూరావు పాల్గొన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో కలిసి పర్యావరణ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రీన్ క్లైమేట్ టీమ్

ఎంవీపీకాలనీ: జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–12 ఉషోదయ కూడలి వద్ద సోమవారం పర్యావరణ పరిరక్షణ మాసోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలలో ప్రతి ఒక్కరూ దేశీయ పండ్ల విత్తనాలను సేకరించాలని సూచించారు. వాటితో విత్తన బంతులు తయారీ చేసి సామాజిక వనాలు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. తద్వారా భూమి మీదున్న జీవరాశి, ప్రకృతిని కాపాడుకోవడంలో అందరూ బాధ్యులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి పర్యావరణ దినోత్సవ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిత్రకారిణి పూర్వీ రజాక్, ఉపాధ్యాయులు పి.రాధాకృష్ణ, గ్రీన్ వలంటీర్లు రాజేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం డిపో మేనేజర్‌గా శరత్‌బాబు బాధ్యతల స్వీకరణ



సింహాచలం డిపో మేనేజర్‌ను సత్కరిస్తున్న జైభీమ్ అసోసియేషన్ సభ్యులు

గోపాలపట్నం: సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శరత్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను డిపో కార్యాలయంలో సింహాచలం డిపోపబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ జైభీమ్ అసోసియేషన్ కమిటీ, జిల్లా అసోసియేషన్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఉద్యోగులు, యాజమాన్యం సమన్వయంతో పని చేస్తే సంస్థ ప్రగతిబాటలో నడుస్తుందని జిల్లా కమిటీ కార్యదర్శి యల్లపు రాంబాబు అన్నారు. ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. దీనిపై డిపో మనేజర్ స్పందిస్తూ అంతా సమష్టి కృషితో పని చేద్దామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె. గురయ్య, కోటేశ్వరరావు, గొల్ల సోములు, పీవీ ప్రసాద్, గోవిందరావు, అప్పారావు, ఎ. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



చినగదిలి తహసీల్దార్‌కు మెమొరాండం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఎంవీపీకాలనీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చినగదిలి మండల తహసీల్దార్‌కు వాల్తేర్ డిపో ఆర్టీసీ ఉద్యోగులు మెమొరాండం అందజేశారు. ఉద్యోగుల సమస్యలపై ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా వివిధ రకాల నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సంస్థ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 5వ దశ ఉద్యమ కార్యాచరణగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల నుంచి స్థానిక తహసీల్దార్‌లకు మెమొరాండం అందజేసే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. యూనియన్ వాల్తేర్ డిపో కార్యవర్గం ఆధ్వర్యంలో చినగదిలి తహసీల్దార్‌కు డివిజనల్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, డిపో చైర్మన్ బి.రవి, డిపో కార్యదర్శి వసంతరావు తదితరులు మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను ఎటువంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా ఆర్టీసీ ద్వారా మాత్రమే కొనాలని, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ డ్రైవర్ల తోనేనే నడపాలని, ఉద్యోగుల నైట్ అవుట్ అలవెన్సులు రూ.150 నుంచి రూ.400కు పెంచాలని, అన్యాయంగా ఉద్యోగుల సస్పెన్షన్లు లేకుండా చర్యలు తీసుకోవాలి వంటి డిమాండ్లపై ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.